www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 20 జులై 2024
5
వైఎస్ఆర్



ప్రతి పాఠశాలలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలి : డిఇఒ

ప్రజాశక్తి - కడప అర్బన్

కలెక్టర్ ఉత్తర్వుల ప్రకారం ప్రతి పాఠశాలలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలని జిల్లా విద్యా శాఖ అధికారి అనురాధ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ స్పందన హాల్ లో లైన్ డిపార్ట్మెంట్, స్కూల్ హెడ్ మాస్టర్ లతో వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకునే విధానాన్ని, వాటి వల్ల కలిగే లాభాలను వివరించారు. కృషి విజ్ఞాన కేంద్రానికి చెందిన ప్రొఫెసర్, హార్టికల్చర్ ఆఫీసర్, ఐసిడిఎస్, డ్వామా పీడీలు, అగ్రికల్చర్ ఆఫీసర్ కిచెన్ గార్డెన్ ఎలా ఏర్పాటు చేసుకోవాలి, ఎలాంటి వాటిని వేయాలి అనే విషయాల్ని చక్కగా వివరించారు.

అదుపులోకిరాని డయేరియా

- పరిస్థితి విషమించి వృద్ధురాలు మృతి
- కలుషిత నీరే కారణమంటున్న వైద్యులు
- పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్న పంచాయతీ అధికారులు
- అల్లాడుపల్లెను సందర్శించిన జిల్లా అధికారులు



ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులు



మురుగు కాలువలలో వ్యర్థాలను తొలగిస్తున్న జెసిబి



వీరమ్మ(ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని అల్లాడుపల్లె గ్రామంలో డయేరియా కేసులు అదుపులోకి రావడం లేదు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి క్రమేపి తగ్గుతుంటే కొత్తవారికి డయేరియా వ్యాధి ప్రబలుతూ ఆసుపత్రి పాలవుతున్నారు. గురువారం రాత్రి వరకు చాపాడు ప్రభుత్వ ఆసుపత్రిలో డయేరియాతో చికిత్స పొంది ఇంటికి వచ్చిన గ్రామానికి చెందిన బాలయ్యపల్లి వీరమ్మ (68) మృతి చెందింది. దీంతో గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయి. ప్రొద్దుటూరులో చికిత్స చిన్న పిల్లలకు వైద్యం పొందుతున్నారు. మంచినీటి పథకానికి సంబంధించిన పైపులైను దెబ్బతిని నీరు కలుషితం కావడం వల్లే డయేరియా కేసులు వస్తున్నాయని వైద్య సిబ్బంది నిర్ధారించారు. గ్రామంలో సరఫరా అవుతున్న తాగునీటిని పరీక్షించగా నీరు కలుషితమవుతుందని గుర్తించామని మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం గ్రామంలో ఆయన ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది పర్యటించి ప్రజలకు డయేరియాపై అవగాహన కల్పించారు. నీటిని కాచి వడబోసి చల్లారిన తరువాత తాగాలని సూచించారు. సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. డయేరియాతో బాధపడుతున్న వారిని గుర్తించి పిహెచ్‌సికి తరలించి వైద్య సేవలు అందజేస్తున్నారు. ఇఒపిఆర్‌డి రాధాకృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి చంద్ర శేఖర్ ఆధ్వర్యంలో డ్రెయినేజీ కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థపదార్థాలను తొలగించారు. మంచినీటి పథకం వద్ద నెలకొని ఉన్న అపరిశుభ్రతను తొలగించారు. గ్రామంలో మురుగు గుంతలు ఉన్న ప్రదేశాల్లో పూర్తిగా బ్లీచింగ్ చల్లించారు.

నీరు కలుషితం కావడం వల్లే..

గ్రామంలో మృతి చెందిన వృద్ధ మహిళకు డయేరియాతో పిహెచ్‌సిలో చికిత్స అందించాం. అయితే ఆమెకు గుండె సంబంధిత, షుగర్ వ్యాధులు ఉన్నాయి. గ్రామంలో మంచినీటి పైపులైను దెబ్బతిని మురుగునీరు కలుషితం అవుతుంది. ఈ నీటిని తాగడం వల్లనే డయేరియా వ్యాపించింది. గ్రామంలో వైద్య సేవలు అందిస్తున్నాం.

- డాక్టర్ రాజేష్ కుమార్, మండల వైద్యాధికారి, చాపాడు.

అల్లాడుపల్లెను సందర్శించిన జిల్లా అధికారులు

అల్లాడుపల్లె గ్రామంలో డయేరియా కేసులు అధికమవుతున్న నేపథ్యంలో ఆ గ్రామాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి నాగరాజు, డిఎల్‌పిఒ ప్రభాకర్ రెడ్డి పరిశీలిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాట్లాడుతూ గ్రామంలో మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేపట్టాలని తెలిపారు. గ్రామంలో పారిశుధ్యచర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో ఎండమాలజిస్ట్ ఖాజా మొహిద్దిన్, డిప్యూటీ డిఎంహెచ్ఒ మల్లేష్ , డాక్టర్ రాజేష్ కుమార్, డాక్టర్ ఓబు లేష్, ఇఒపిఆర్‌డి రాధాకృష్ణవేణి, వెంకటరెడ్డి, సిహెచ్ఒ మహదేవ్ యాదవ్, ఎంపిహెచ్ఒ రాఘవయ్య, సూపర్‌వైజర్లు బాబు రెడ్డి, సరస్వతి, భాస్కర్, వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి చంద్ర శేఖర్, ఆశాలు పాల్గొన్నారు.

నీటి ట్యాంకులను తరచూ శుభ్రం చేయాలి : డిపిఒ

గ్రామాలలో మెరుగైన పారిశుధ్య చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని అల్లాడుపల్లెలో ఆయన పర్యటించారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో డయేరియా వ్యాపిస్తుందని, మంచినీటి పథకాలను తరచూ శుభ్రం చేయాలన్నారు. తాగునీటి పైపులైన్‌లు ఎక్కడైనా దెబ్బ తింటే వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు మురికి గుంతలు, డ్రెయినేజీ కాలువల్లో విడత పదార్థాలను తొలగించి బ్లీచింగ్ చెల్లించాలన్నారు. ఇంటి పన్నుకు సంబంధించిన సర్వేను వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో డిఎల్‌పిఒ విజయభాస్కర్, ఎంపిడిఒ రహంతుల్లయ్య, ఇఒపిఆర్‌డి రాధాకృష్ణ వేణి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



వైద్యులకు, సిబ్బంది సూచనలిస్తున్న డిఎంహెచ్ఒ నాగరాజు

వ్యవసాయ కార్మికులకు పరిహారం చెల్లించాలి

- ఎపి వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

వర్షాభావ పరిస్థితుల కారణంగా నష్టపోయిన రైతు, కౌలురైతు, వ్యవసాయ కార్మికులను ఆదుకుని నష్టపరిహారం చెల్లించాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్, ఎర్రగుంట్ల మండల నాయకుడు మల్లికార్జురెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఎర్రగుంట్ల రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసిల్దార్ బి. తేజస్వినికి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వినతి అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎపి రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీల పిలుపులో భాగంగా, రైతులకు, వ్యవసాయ కార్మికులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని తహశీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చామని చెప్పారు. గత ఏడాది కరువు, తుపాణ్ల కారణంగా దెబ్బతిన్న పంటలకు బీమా, పరిహారం రైతుల ఖాతాలో వేయాలని పేర్కొన్నారు. 2023వ సంవత్సరం ఖరీఫ్ సీజన్ కు సంబంధించి రాయలసీమ మరికొన్ని జిల్లాలలో రైతులు నష్టపోయారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 2021, 2022 సంవత్సరాలకు సంబంధించిన బీమా పరిహారం రైతుల ఖాతాలో వేశారని, 2023 ఏడాది ఖరీఫ్‌లో వర్షాభావం వల్ల దెబ్బతిన్న పంటలకు ఇంతవరకు పరిహారం వేయలేదని వాపోయారు. రాష్ట్రంలో పాలన మారినా రైతులకు ఒరిగిందేమీ లేదని వాపోయారు. ఉచిత పంటల బీమా స్థానంలో రైతులకు భాగస్వామ్యం పేరుతో బీమా ప్రీమియం భారాన్ని రైతులపై వేసే ఆలోచన ఈ ప్రభుత్వం చేస్తుందని పేర్కొన్నారు. వెంటనే ప్రభుత్వం దెబ్బతిన్న పంటలకు బీమాపరిహారం ఇవ్వాలన్నారు. రైతు సేవ కేంద్రాలను బలపరచాలని పేర్కొన్నారు. రైతులకు ఎరువులు, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. **గోపవరం :** రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు రైతుల ఖాతాలో జమ చేయాలని, ఉపాధి పనులు 200 రోజులకు పెంచి రోజు కూలి రూ. 600 అమలు చేసి పెండింగ్‌లో ఉన్న ఉపాధి బిల్లులను తక్షణమే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎపి రైతు సంఘం కడప జిల్లా కార్యదర్శి బి దస్తగిరి రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం కడప జిల్లా ఉపాధ్యక్షులు డి వెంకటేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం బద్వేల్ తహశీల్దార్ మధుసూదన్‌రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి కూటమి మెజార్టీతో రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిందని వ్యవసాయ సీజన్ ప్రారంభమైందని ఈ ఖరీఫ్ లో వ్యవసాయ పెట్టుబడుల కోసం రైతాంగం తీవ్రంగా ఇబ్బందులు పడుతుందని వారు అన్నారు. పెట్టుబడి సహాయం కింద ఇస్తామన్న రూ.20 వేలు వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలని వారు కోరారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టే జీవో నెంబర్ 22ను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు వినతి పత్రం ఇచ్చిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఓబులేసు రామ్మోహన్ అరవిందు చిన్న పాల్గొన్నారు. **కలసపాడు :** వర్షాభావ పరిస్థితుల కారణంగా నష్టపోయిన రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మికులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సగిలి గురయ్య, గుడిమే సుదర్శన్ డిమాండ్ చేశారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కెవిపిఎస్ .ఎస్ ప్రవీణ్, హుస్సేన్ పీరా, గ్రామస్తులు పాల్గొన్నారు. **అట్లూరు :** రైతు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని తమ్మళ్లగొంది సచివాలయం వద్ద సచివాలయ అధికారికి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండల దేవ నగర్ శాఖ కార్యదర్శి వినతి పత్రం అందజేశారు.



రైతు సమస్యలపై డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న అన్వేష్

పట్టు సడలిన మతతత్వ రాజకీయాలు

డివైఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షులు జి.చంద్రశేఖర్



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న జి.చంద్రశేఖర్

ప్రజాశక్తి - బద్వేలు

మతతత్వ రాజకీయాల పట్టు సడలిందని, యువత అవకాశవాద తప్పుడు ధోరణుల వైపు వెళ్లకుండా చూడాలని డివైఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షులు జి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. స్థానిక సుందరయ్య భవనంలో శుక్రవారం భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) కడప జిల్లా 'జిల్లా వర్క్ షాప్' డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం.చిన్ని అధ్యక్షతన నిర్వహించారు. మాజీ అధ్యక్షులు జి.చంద్రశేఖర్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుతం దేశంలో 2024 ఎన్నికల్లో మూడవ దఫా కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి మతతత్వ రాజకీయాలకు పట్టు సడలిందని, మిత్రపక్షాలైన బాబు, నితీష్ ల పైన ఆధారపడి అధికారంలోకి వచ్చిందని పేర్కొన్నారు. బిజెపి సొంత బలం 2019 పార్లమెంట్లో సంఖ్యా బలం 303 ఉంటే, 2024 నాటికి 240కి పడిపోయిందని, బిజెపి సిట్టింగ్ సీట్లు 63 ఓడిందని, ప్రజలు దేశంలో బలమైన ప్రతిపక్షాలకు అవకాశం కల్పించారని తెలిపారు. బిజెపి మోడీ పొలిటికల్ గ్రాఫ్ క్రమంగా తగ్గి బలహీనపడుతోందని అనడానికి అయోధ్యలో బిజెపి ఓడిపోవడం, వారణాసిలో బిజెపి మెజార్టీ తగ్గడమే రుజువని చెప్పారు. రాష్ట్రంలో సచివాలయ వాలంటీర్లను తిరిగి విధులలోకి తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 25 వేల ప్రభుత్వ ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేసే విధంగా డిఎస్‌సి నోటిఫికేషన్ ఉండాలన్నారు. టెట్‌కు చదువుకోవడానికి సమయం ఉండాలన్నారు. ఎపి పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ -2 మెయిన్స్ పరీక్షలకు ప్రిపరేషన్‌కు సమయం ఉండాలని పేర్కొన్నారు అవకాశవాద తప్పుడు పేడధోరనుల వైపు వెళ్ళకుండా భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) కృషి చేయాలన్నారు. జిల్లా కార్యదర్శి వీరణాల.శివకుమార్ మాట్లాడుతూ కడప ఉక్కును కేంద్రం పూర్తిగా విస్మరించింది అన్నారు. విభజన హామీలు లో కడప ఉక్కు చట్టబద్ధంగా స్పష్టంగా కేంద్రం ప్రభుత్వం ఆధీనంలో నిర్మించాలని ఉన్న దీనిపై కేంద్రం జరిగిన పార్లమెంట్ సమావేశాలలో ఒక్క మార్గన కడప ఉక్కుకు నిధులు రాష్ట్రం లో ప్రభుత్వాలు పాలకులు మారినా ఈ ప్రాంత అభివృద్ధి మాత్రం జరగడం లేదు అన్నారు. కడప ఉక్కు శిలాఫలకాలు వేస్తున్నారే తప్ప దాని నిర్మాణానికి చర్యలు చేపట్టడం దారుణమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ సమావేశాలలో కడప ఉక్కు నిధులు కేటాయించే విధంగా ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు.జిల్లా ఉపాధ్యక్షులు నరసింహులు, డేవిడ్, జిల్లా సహాయ కార్యదర్శిలు తులసి, అంజి, జిల్లా కమిటీ సభ్యులు విజయ, విశ్వనాథ్, మహేష్, మహిళా కన్వీనర్ గురుదేవి,. నాగలక్ష్మి , జిల్లాలోని వివిధ ప్రాంతాల కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంఇఒ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - కడప అర్బన్ : జిల్లాలోని వివిధ మండలాల్లో ఉద్యోగ విరమణ పొందిన మండల విద్యాశాఖాధికారుల స్థానంలో ప్రధానోపాధ్యాయులు, ఇతర మండల విద్యాశాఖాధికారులు అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారని, దీనివల్ల వారిపై పని భారం ఎక్కువై తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని, ఉద్యోగోన్నతల ద్వారా రెగ్యులర్ ఎంఇఒలను భర్తీ చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి రాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్,పాలెం మహేష్ బాబు, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు బిల్లా హరిప్రసాద్ కోరారు. పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకుల వారి కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆర్జెడి శ్యామ్యూల్‌ను మర్యాదపూర్వకంగా యుటియఫ్ కడప, అన్నమయ్య జిల్లాల పక్షాన కలిసి అభినందనలు తెలియజేసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక్క ఎంఇఒ రెండు, మూడు మండలాలకు బాధ్యత వహించడం, ఎంఇఒ- 2 స్థానంలో ప్రధానోపాధ్యాయులు అదనపు బాధ్యతలు నిర్వర్తించడం వల్ల పరిపాలన పరంగా కొంతమేర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఆర్‌జెడి స్పందిస్తూ ఖాళీగా ఉన్న ఎంఇఒ స్థానాల్లో రెగ్యులర్ ప్రాతిపదికన ఉద్యోగోన్నతుల ద్వారా నియామకాలు చేపట్టుటకు ప్రభుత్వానికి తగిన ప్రతిపాదనలు పంపుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, కార్యదర్శులు సి.వి.రమణ, ఏజాస్ అహ్మద్, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, నాయకులు బత్తుల చంద్రశేఖర్, యడాల సురేష్ కుమార్, సుబ్బారెడ్డి,శంకర్ రెడ్డి, వెంకటరమణ, శివశంకర్, సమీర్ బాషా, నాగరాజు, డేవిడ్ పాల్గొన్నారు. **ఎపిజిఎల్ఐ సమస్యలను పరిష్కరించండి..** జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయుల జీవిత బీమా పాలసీలకు సంబంధించిన వివిధ సమస్యలను వెంటనే పరిష్కరించాలని యుటియఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు కోరారు. శుక్రవారం ఎపిఎల్ఐ కార్యాల యంలో జీవిత బీమా సహాయ సంచాలకులు రమేష్ బాబుని యుటిఎఫ్ కడప జిల్లా శాఖ పక్షాన కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలామంది ఉద్యోగ, ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ పొందారని, వారి పాలసీల గడువు ముగిసి రెండేళ్ల యినా ఫైనల్ చెల్లింపులు జరగడంలేదని తెలిపారు. చనిపోయిన ఉద్యోగులకు చెల్లించాల్సిన పాలసీ సొమ్ములు చెల్లించడం లేదని, ప్రతినెల ఉద్యోగులు జీవిత బీమా సంస్థకు ప్రీమియం చెల్లిస్తున్నప్పటికీ మిస్సింగ్ క్రెడిట్ ఎక్కువగా ఉన్నా యని చెప్పారు. సదుపాయాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

కృష్టారెడ్డి, మేరీలకు జాతీయ సేవారత్న అవార్డు

ప్రజాశక్తి - కడప అర్బన్



అవార్డు అందుకున్న కృష్ణారెడ్డి, మేరీ

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన డే స్ప్రింగ్ థియలాజికల్ యూనివర్సిటీ యుఎస్ఎ వారు అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన నేషనల్ సేవా రత్న అవార్డును సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి, మేరీ అందుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఈ అవార్డులను ప్రదానం చేశారు. కృష్ణారెడ్డి 2000 సంవత్సరంలో కృషి డెవలప్మెంట్ స్వచ్ఛంద సేవా సొసైటీని స్థాపించి రంగారెడ్డి, వికారాబాద్‌లో పాఠశాలలు నడుపుతూ ఉన్నారు. వికారాబాద్‌లో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. డిఆర్‌డిఎ వాటర్ షెడ్ ప్రాజెక్టులు వికారాబాద్ మండలంలో చేపట్టారు. రంగారెడ్డి జిల్లా మల్లాపూర్, ఉప్పల్‌లో విద్యా సంస్థలను నడుపుతూ అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ ఉన్నారు. ప్రస్తుతం కడపలో ఒక గోశాలను నడుపుతూ ఉన్నారు. రామాంజనేయ పురంలో ఉన్నటువంటి శ్రీ సరస్వతి విద్యానికేతన్ హైస్కూల్‌లో తెలుగు అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తూ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎడ్యుకేషనల్ డైరెక్టర్‌గా అనేక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. కమలాపురానికి చెందిన అంకిరెడ్డి మేరీ సేవారత్నా అవార్డు అందుకున్నారు.



మాట్లాడుతున్న జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ కమిటీ కార్యదర్శి సి శ్రీనివాసులురెడ్డి

బ్యాంకుల ప్రయివేటీకరణను అడ్డుకుందాం

ప్రజాశక్తి - కడప

ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రవేటికరణను అడ్డుకుందామని సదస్సులో వక్తలు పిలుపునిచ్చారు. 55వ బ్యాంకు జాతీయికరణ వార్షికోత్సవ సందర్భంగా శుక్రవారం కడప జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ కమిటీ కార్యదర్శి సి. శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో డిసిసిబి సమావేశ మందిరంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగ అవగాహన సదస్సుకు గౌరవ అతిథిగా ఎల్ఐసి ఎంప్లాయిస్ యూనియన్ కడప డివిజన్ ముఖ్య కార్యదర్శి ఎ.రఘునాథ్ రెడ్డి, వక్తలు మాట్లాడారు.14 ప్రధాన ప్రయివేట్ బ్యాంకులను 19 జూలై, 1969న జాతీయం చేయబడటం వల్ల 55వ బ్యాంక్ జాతీయాకరణను వార్షికోత్సవాన్ని జూలై 19, 2024న జరుపుకుంటున్నామని తెలిపారు. 55 ఏళ్లలో ప్రభుత్వ రంగ బ్యాంకులు బ్యాంకింగ్ సేవలను క్లాస్ బ్యాంకింగ్ నుంచి మాస్ బ్యాంకింగ్‌గా మార్చాయి అని తెలిపారు. బ్యాంకులు సామాన్యులకు అందుబాటులోకి వచ్చాయి, మారుమూల గ్రామీణ ప్రాంతాలకు కూడా బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి వచ్చాయి అన్నారు. ప్రాధాన్య రంగాలకు క్రెడిట్‌ను విస్తరించడం ద్వారా పిఎస్‌బిలు ఆర్థిక వృద్ధికి ఇంజిన్‌లుగా మారాయి అని అన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకులను బలోపేతం చేయడం, విస్తరించాల్సిన అవసరం ఉన్న తరుణంలో, ప్రస్తుత ప్రభుత్వం ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రయివేటీకరించాలని చూస్తోంది అన్నారు. ప్రయివేటీకరణ చర్యలను వ్యతిరేకించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి కడప జిల్లా నాయకులు నాగసుబ్బా రెడ్డి, ఎఐబిఒఎ కడప జిల్లా నాయకులు గరుడయ్య, కో- ఆర్డినేషన్ కమిటీ అధ్యక్షులు దస్తగిరి, కార్యదర్శి సి. శ్రీనివాసులు రెడ్డి, ఆర్గనైగింగ్ సెక్రటరీ అనిల్ రెడ్డి, గౌరవ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ నారాయణ రెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.

సహజ వనరులను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-అట్లూరు : సహజ వనరుల సద్వినియోగంతో ప్రకృతి వ్యవసాయం విస్తరించాలని జిల్లా వ్యవసాయ సహాయ అధికారి నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం సిద్ధవటం మండలం, మాచుపల్లి రైతు సేవా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు దస్త్రాలను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ .రైతు సేవా కేంద్ర ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలు అమలు చేయాలన్నారు. మహిళా సంఘాలను కూడా భాగస్వామ్యం చేయాలన్నారు. ఉత్తమ యాజమాన్య పద్ధతులతో కూడిన పొలంబడి లింగంపల్లిలో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రైతు సేవ కేంద్ర సహాయకులు ,ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, సిఆర్‌పిలు, రైతులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి - మైదుకూరు : పట్టణంలోని 16వ వార్డు ప్రొద్దుటూరు రోడ్డు అన్న క్యాంటీన్ వద్ద ఉన్న బోర్ మోటారు కొద్ది రోజులు కిందట కాలిపోయింది. స్థానికులు తాగునీటి సమస్య ఏర్పడింది. వారి సమస్యను గుర్తించిన స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకుడు యాపరాల చిన్న నీటి సమస్యకు పరిష్కారం చూపారు. తన సొంత ఖర్చులతో శుక్రవారం కొత్త మోటార్‌ను ఏర్పాటు చేసి తాగునీటి సరఫరాను అందించారు.

పాఠశాలల్లో డ్రైడే నిర్వహించాలి

ప్రజాశక్తి- కడప అర్బన్

ప్రతి శుక్రవారం పాఠశాలల్లో తప్పనిసరిగా డ్రై డే నిర్వహించాలని కడప మండల విద్యాశాఖ అధికారులు గంగిరెడ్డి, ఇర్షాద్ అహ్మద్ సూచించారు. శుక్రవారం కడప నగరంలోని నగరపాలక ప్రాథమిక పాఠశాల నాగరాజు పేట పాఠశాలలో డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా విద్యార్థులకు సీజనల్‌లో వచ్చే వ్యాధులు వాటి నుంచి ఎలా కాపాడుకోవాలి, ఎలా జాగ్రత్తగా ఉండాలి అన్న విషయంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు భోజనం ముందు, తర్వాత చేతులు శుభ్రం చేసుకునే విధానాన్ని తెలియజేశారు. పాఠశాల పరిసరాల్లో నీరు నిలువ ఉండకుండా జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. అలాగే ఎక్కడైనా పొరపాటున నీళ్లు నట్లయితే వాటిని పైన బ్లీచింగ్ చల్లి పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆదేశించారు. ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసుకుని ప్రతి ఉపాధ్యాయుడు సీజనల్ వ్యాధుల గురించి విద్యార్థుల వివరించడంతోపాటు వ్యక్తిగత పాఠశాల పరిశుభ్రత వంటి వాటిపై అవగాహన కల్పిస్తూ ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కవిత, సుధారాణి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నిరంజన్ ప్రభు, కడప మండలం వనరుల కేంద్ర సిబ్బంది జమీలునిషా, సుభాషిణి పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల స్వరం వినిపించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో 12 సంవత్సరాల నుంచి పనిచేస్తున్న సిఆర్‌పిలకు ఉద్యోగ భద్రత, ఎంటిఎస్ అమలు చేసి న్యాయం చేయాలని కోరారు. శుక్రవారం కడప ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే మాధవిని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు. ఈ సందర్భంగా సిఆర్‌పిలు మాట్లాడుతూ గత ప్రభుత్వం తమకు అన్యాయం చేసిందని, జీవో నంబర్ 65 రద్దుచేసి క్లస్టర్‌ను తొలగించిందని వెంట క్లస్టర్‌కు కేటాయించాలని కోరారు. గత ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని చెప్పి మాట తప్పిందని, ఈ ప్రభుత్వంలో నైనా తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎంఎస్‌సి, బిఇడి, టెట్ పూర్తి చేసిన వారికి, జిల్లా ఎంపిక కమిటీ ఆధ్వర్యంలో రోస్టర్, మెరిట్, ఇంటర్వ్యూ ద్వారా ఎంపికయ్యామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సిఆర్‌పిలు3 వేలకు పైగా ఉన్నారని చెప్పారు. వారందరికీ మినిమం టైం స్కేల్ వర్తింపజేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సిఆర్ పిలు నాగమణి, కుమారి, సుభాషిణి, జమీలున్నీసా, మంగమ్మ, సువర్ణ, రాజేశ్వరి, రఘుపతి, శంకర్, వెంకటాద్రి, రామచంద్ర, కృష్ణ పాల్గొన్నారు.

అంగన్వాడీల సమ్మె పుస్తకం ఆవిష్కరణ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : అంగన్వాడీలు 42 రోజుల సమ్మె పుస్తకాన్ని స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి లక్ష్మీదేవి, అధ్యక్షులు ఆర్.లక్ష్మి దేవి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో 42 రోజులు ఆందోళన ఫలితంగా కొన్ని అంగన్వాడీ సమస్యలు పరిష్కరించుకున్నామని చెప్పారు. చరిత్రలో 42 రోజులు సమ్మె ఎప్పుడూ లేనివిధంగా సుదీర్ఘంగా జరిగిందన్నారు. అంగన్వాడీ టీచర్లు భయపడకుండా సమ్మె జయప్రదం చేశారని పేర్కొన్నారు. ఏ ప్రభుత్వాలు వచ్చినా ఆందోళన తప్ప వేరే మార్గం లేదని పేర్కొన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టిడిపి జీతాలు పెంచుతామని, గ్రాడ్యుటి ఏర్పాటు చేస్తామని సమ్మె దగ్గరికి వచ్చి హామీ ఇచ్చిందని చెప్పారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు.

మున్సిపల్ కార్మికుల కష్టాలు తీర్చాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ డిమాండ్

ప్రజాశక్తి- కడప అర్బన్



మున్సిపల్ కార్మికులు చేస్తున్న పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న మనోహర్

జిల్లాలో మున్సిపల్ కార్మికుల కష్టాలు, బాధలు తీవ్రంగా ఉనాన్నయని, వాటిని తక్షణమే పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ కోరారు. శుక్రవారం మున్సిపల్ కార్మికులు చేస్తున్న మురుగు పనులను పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప కార్పొరేషన్‌తో పాటు బద్వేలు, మైదుకూరు, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, పులి వెందుల, కమలాపురం ప్రాంతాల్లో మున్సిపల్ కార్మికులు పనిచే స్తున్నారని తెలిపారు. మున్సిపల్ కార్మికులు ప్రజల మలినాలను తొలగిస్తూ, పరిశుభ్రత ఉంచడంలోనూ కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. అలాంటి మున్సిపల్ కార్మికులకు సరైనటువంటి సౌకర్యాలు, పనిముట్లు లేకపోవడం బాధాకరమని తెలిపారు. ప్రమాదం జరిగితే పట్టించుకుంటే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని సమస్యలు వచ్చినా, కష్టాలు వచ్చినా ప్రజలు బాగుండాలనే ఉద్దేశంతో మున్సిపల్ కార్మికులు పనిచేయడం సంతోషించదగ్గ విషయమన్నారు. కడపలో మున్సిపల్ కార్మికులు పడుతున్నటువంటి కష్టాలను పరిశీలించారు. మున్సిపల్ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

హెడ్‌నర్స్ పోస్టుల భర్తీ

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా సర్వజన ఆస్పత్రికి చెందిన ఇద్దరు స్టాఫ్‌నర్స్‌లకు ప్రమోషన్ లభించనుంది. రాష్ట్ర రీజినల్ డైరెక్టర్ మెడికల్ అండ్ హెల్త్ సర్వీస్ డిపార్టుమెంట్ ఉద్యోగోన్నతి కల్పించాలని ఉత్తర్వులు జారీ చేసింది. శనివారం ఉదయం 11 గంటలకు జిల్లా సర్వజన ఆస్పత్రికి చెందిన స్టాఫ్‌నర్స్‌లు ఎన్.సుగీర్తమ, మేరీ స్టెల్లాకుట్టీలు రీజినల్ డైరెక్టర్ కార్యాలయానికి చేరుకుని ప్రమోషన్ ఉత్తర్వులను అందుకోనున్నారు.

విద్యార్థులకు ఆధార్ తప్పనిసరి

ప్రజాశక్తి-కలసపాడు

మండలంలో ప్రాథమిక,ప్రాథమిక ఉన్నత, జిల్లా పరిషత్ పాఠశాలలో, ఇంగ్లీష్ మీడియం ప్రయివేట్ పాఠశాల్లో చదువుతున్న విద్యార్థులకు ఆధార్ తప్పనిసరిగా పాఠశాలలో నమోదు చేసుకోవాలని ఎంఇఒ మస్తాన్‌వలి తెలిపారు. పాఠశాలలు ప్రారంభమై నెల రోజులు అయినప్పటికీ ఇంకా అక్కడక్కడ విద్యార్థులు పాఠశాలలకు పోకుండా ఇళ్ల వద్ద ఉంటున్నట్లయితే తల్లిదండ్రులు చొరవ తీసుకొని విద్యార్థులను వారికి నచ్చిన పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు తెలిపారు.



వైసిపి కార్యకర్తలను పరామర్శిస్తున్న ఎంపీ అవినాష్‌రెడ్డి

అధైర్య పడకండి... అండగా ఉంటాం

- కార్యకర్తలకు ఎంపీ వై.ఎస్.అవినాష్‌రెడ్డి భరోసా

ప్రజాశక్తి- సింహాద్రిపురం

పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకూ అండగా ఉండి అన్ని విధాలుగా ఆదుకుంటామని కడప పార్లమెంట్ సభ్యుడు వై.ఎస్. అవినాష్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన సింహాద్రిపురంలో ఇటీవల టిడిపి కార్యకర్తల దాడులు చేసిన హాజీ వలి, ప్రతాప్ రెడ్డి, అబ్బాస్ కుటుంబాలను పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన ఆరు వారాల వ్యవధిలోనే అనేకమంది వైసిపి కార్యకర్తల పైన దాడులు చేయడం శోచనీయమన్నారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తనయుడు లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం అంటూ వైసిపి కార్యకర్తలపై దాడులు చేయడం ఏమిటి అని ఆయన ప్రశ్నించారు. వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కార్యకర్తలను వారి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్నామని చెప్పారు. అధికార పార్టీ నాయకులు కక్షపూరితంగా వ్యవహరిస్తూ జిల్లాలోనే వందల మంది కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని వాపోయారు. నియోజవర్గంలోని వేంపల్లిలో వైఇసపి కార్యకర్త అజయ్ కుమార్‌రెడ్డిపై దాడి చేశారన్నారు. సింహాద్రిపురం మండలంలో సైతం ఇలాంటి దాడులు చేయడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ దేవి రెడ్డి శ్రీకాంత్ రెడ్డి, వైసిపి నాయకులు బ్రహ్మానంద రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, రాజగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఫిర్యాదుతో పనులు పునఃప్రారంభం

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ ప్రాంతంలో డ్రెయినేజీ పనులను కాంట్రాక్టర్లు చేయకుండా కొద్ది రోజుల కిందట నిలిపి వేశారు. ఇటీవల పట్టభద్రుల ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి పనులపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డికి పిర్యాదు చేశారు. మంత్రి ఆదేశాల మేరకు కాంట్రాక్టర్ ఆర్‌టిసి బస్టాండ్ ఎదురుగా అసంపూర్తిగా నిలిచి పోయిన ఇన్, అవుట్ రహదారి పనులను శుక్రవారం పునః ప్రారంభించారు. వేంపల్లెలో ఆర్‌టిసి బస్టాండ్ నూతనంగా కోట్లాది రూపాయలతో నిర్మించారు. బస్టాండ్ లోకి బస్సులు వెళ్లాలంటే డ్రెయినేజీ పనులు అసంపూర్తిగా నిలిచి పోవడంతో బస్టాండ్‌ను ప్రారంభించలేదు. ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి చొరవతో పనులు మొదలు కావడంతో త్వరలో బస్టాండ్ ప్రారంభానికి నోచుకుంటుందని పలువురు పేర్కొన్నారు.

తాగునీటి పైపులైనుకు మరమ్మతులు

ప్రజాశక్తి - చక్రాయపేట

మండలంలోని సురభి గ్రామం నాగలగట్టుపల్లెలో తాగునీటి పైపులైను లీకేజీ కావడంతో ఆ గ్రామ ఉపసర్పంచ్ దాసరి ఆంజనేయులు శుక్రవారం మరమ్మతులు శ్రీకారం చుట్టారు. పైపులైను లీకేజీ కావడంతో నీరు వృథా కావడంతో బజారులో వృద్ధులు నడవడానికి కూడా ఇబ్బందికరంగా ఉన్న విషయాన్ని వారి దృష్టికి తీసుకురావడంతో వారి సొంత నిధులతో దగ్గర ఉండి మరమ్మతులు చేయించారు. తెలుగుదేశం పార్టీ మండల ఇన్‌ఛార్జి తాళ్లపల్లి మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో ఉన్న చిన్న చిన్న సమస్యలు వెంటనే పరిష్కరించేందుకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం కార్యకర్త శ్రీకాంత్ పాల్గొన్నారు.

శాకంబరీదేవి అలంకారంలో వాసవి మాత

ప్రజాశక్తి-మైదుకూరు

ఆషాడ మాసం సందర్భంగా శుక్రవారం స్థానిక అమ్మవారి శాలలో శాకంబరీ దేవి అలంకారంలో వాసవి మాత భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య సభ ఆధ్వర్యంలో అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహానికి చీరలతో ప్రత్యేక అలంకారం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి వడి బియ్యం కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. ప్రతి ఆర్యవైశ్యుని ఇంటి నుంచి అమ్మవారికి వడి బియ్యాన్ని సమర్పించారు. కార్యక్రమంలో మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

500 కిలోల పశుగ్రాస విత్తనాలు మంజూరు

ప్రజాశక్తి-కలసపాడు



మహిళారైతులకు ఎరువులు, విత్తనాలు అందజేస్తున్న వ్యవసాయాధికారి

మండలానికి పశుగ్రాసం కోసం 500 కిలోల విత్తనాలను ప్రభుత్వం మంజూరు చేసిందని పశువైద్యాధికారి ఎ.వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం మండలంలోని పశువైద్య కార్యాలయంలో ఆయన మండల రైతులకు పశుగ్రాసాన్ని ఐదు కేజీల ప్యాకెట్ 75 శాతం సబ్సిడీతో రూ.115 లకే అందించారు. అనంతరం రైతులతో పశువులు, గొర్రెలకు వస్తున్న సీజనల్ వ్యాధులు పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు.

అనుమతులు లేని వెంచర్ల తొలగింపు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల



అధికారులతో మాట్లాడుతున్న లేఅవుట్ యజమానులు

స్థానిక నగర పంచాయతీ పరిధిలో అనుమతులు లేకుండా ఉన్న వెంచర్లను టౌన్ ప్లానింగ్ అధికారులు శుక్రవారం తొలగించారు. ధనార్జన ధ్యేయంగా పటణంలో పలువురు లేఅవుట్లు వేసి ప్రజలకు అధిక ధరలకు విక్రయించారని పలువురు ఆరోపిస్తున్నారు. 2019 నుండి 2024 వరకు గత ప్రభుత్వంలో జిల్లాలో వందల సంఖ్యలో అనుమతులు లేకుండా వెంచర్లు వేశారని, అందులో ప్లాట్లు కొన్న ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. ఆ మేరకు మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ఆదేశాల మేరకు పట్టణంలోని 19 వెంచర్లకు సంబంధించి ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లే లేవని గుర్తించి,నోటీసులు జారీ చేశారు. నోటీసులు జారీ చేసిన 19 వెంచర్లను శుక్రవారం మున్సిపల్ అధికారులు వెంచర్లలోని నెంబర్ రాళ్ళను, గోడలను జెసిబి యంత్రం సహాయంతో తొలగించారు. అనుమతులు లేని వెంచర్లలో ఇంటి నిర్మాణం చేపడితే ఇంటికి సంబంధించి ప్లాన్ అండ్ అప్రూవల్ ఇవ్వబోమని, పెనాల్టీల రూపంలో అధిక పన్నులు వసూలు చేస్తామని మున్సిపల్ అధికారులు తెలిపారు

నూతన డిఐజిని కలిసిన జగదీష్ బాబు

ప్రజాశక్తి- పులివెందుల రూరల్

కర్నూల్ రేంజ్ నూతన డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్ బాధ్యతలు శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా పులివెందులకు చెందిన జనసేన యువనాయకుడు కాపునాడు(రాయల్), కన్వీనర్, రాష్ట్ర యూత్ లీడర్ జగదీష్ మర్యాద పూర్వకంగా కలిశారు. పూలబొకే అందించి డిఐజి శాలువాతో సత్కరించారు.



నూతన డిఐజికి బొకేను అందిస్తున్న జగదీష్

అడవి పందుల దాడి.. అరటి పిలకలు ధ్వంసం

రూ.6 లక్షల నష్టం
ప్రభుత్వం ఆదుకోవాలని కౌలు రౌతుల వేడుకోలు

ప్రజాశక్తి - వేంపల్లె

అరటి పంటతో పది రూపాయలు సంపాదించాలనే ఆశతో భూమిని కౌలుకు తీసుకొని అరటి పంటను సాగు చేస్తే అడవి పందులు పంటను ధ్వంసం చేశాయి. దీంతో దాదాపు రూ. 6 లక్షల వరకు నష్టం వాటిల్లిందని కౌలు రైతులు లబోదిబోమంటున్నారు. వేంపల్లె పొలంలో రామగంగిరెడ్డి, ఈశ్వర్ రెడ్డి అనే రైతులు ఎకరాకు రూ. 30 వేలు కౌలుతో 11 ఎకరాల్లో అరటి పంటను సాగు చేశారు. అరటి పంటను సాగు చేసేందుకు హైదరాబాద్, బెంగళూరు రాష్ట్రాలకు వెళ్లి అరటి పిలకలను తీసుకొచ్చి పెట్టారు. అరటి పంట మంచి దిగుబడి వచ్చేందుకు నీటి సౌకర్యం కోసం లక్షలాది రూపాయలు ఖర్చు చేసి డ్రిప్ ఏర్పాటు చేశారు. ఎరువులు కూడా వేశామని వారు చెప్పారు. పంటను కాపాడుకొంటూ వస్తుండగా గురువారం అర్ధరాత్రి అడవి పందుల మంద అరటి పంటపై పడి దాదాపు 4 ఎకరాల్లో అరటి పిలకలను దున్నేశాయని వాపోయారు. కంటికి రెప్పల పంటను కాపాడుకొంటూ వస్తున్న సమయంలో ఒక సారిగా అడవి పందుల వల్ల పంట సాగుకు పూర్తిగా నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. కౌలు కాకుండా అరటి పంటను సాగు చేసేందుకు ఇప్పటి వరకు ఒక ఎకరాకు రూ 1.50 లక్షలు ఎరువులు, అరటి పిలకలకు, కూలీలకు పెట్టుబడి కింద ఖర్చు చేసినట్లు తెలిపారు. అడవి పందులు దాదాపు నాలుగు ఎకరాల్లో పంటను ధ్వంసం చేశాయని పేర్కొన్నారు. కొండ ప్రాంతం దగ్గరగా ఉండడంతో అడవి పందుల మంద వచ్చినట్లు చెప్పారు. అరటి పిలకలను నాటి 3 నెలలు అవుతోందని కౌలు రైతులు వాపోయారు. పిలకలను నాటిన తర్వాత కుందేల బెడద కూడా ఎక్కువగా ఉండేదని వాటి నుండి రక్షించుకొన్న తర్వాత అడవి పందులతో పంట పూర్తిగా దెబ్బతిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి సమయంలో అడవి జంతువులు పంటలపై దాడి చేయడంతో రైతులు కోలుకోలేక పోతున్నట్లు తెలిపారు. సరిపోని వారు కూడా ఈ విధంగా అరటి పీలకలను పీకరు, దాని కంటే ఘోరంగా అడవి జంతువులు పంటను నాశనం చేశాయని వాపోయారు. పంటను కాపాడుకొనేందుకు పగలంతా పంట పొలాల్లోనే సమయాన్ని వెచ్చిస్తున్నామని అయితే రాత్రి సమయంలో వచ్చే అడవి జంతువులతో రైతులు పూర్తిగా నష్ట పోతున్నట్లు చెప్పారు. అప్పులు తెచ్చి పంట సాగు చేసినప్పటికీ చేతికి రాక ముందే ఇలాంటి ఘటనలతో నష్టాల బారిన పడుతున్నట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ పంటను సాగు చేయాలంటే లక్షలాది రూపాయలు ఖర్చు అవుతుందని చెప్పారు. పంట నష్టంపై ఉద్యాన, రెవెన్యూ, వ్యవసాయ అధికారులు పరిశీలించి తమకు ఆర్థికంగా నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కౌలు రైతులు కోరారు.



ధ్వంసమైన అరటి పిలకలను చూపుతున్న బాధిత రైతు

మహిళలపై వేధింపులు తగవు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మహిళలపై వేధింపులు తగవని జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారి డి. శ్రీలక్ష్మి తెలిపారు. శుక్రవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయ సభా భవన్‌లో పోష్ యాక్ట్-2013 చట్టంపై రెవెన్యూ డివిజన్ పరిధిలోని మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపుల నివారణకు పోష్ చట్టం పటిష్టంగా పనిచేస్తుందన్నారు. ప్రభుత్వ, ప్రయివేట్, ఇతర సంస్థలలో పని చేస్తున్న వారు, సంఘటిత, అసంఘటిత రంగాలకు చెంది 10 మందికి పైగా ఉద్యోగులు కలిగిన సంస్థలు అన్ని కూడా ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి కమిటీ సమావేశం నిర్వహించాలని, ఫిర్యాదు లుంటే వెంటనే పరిష్కరించాలని సూచించారు. ప్రతి ఏడాది కమిటీ వార్షిక నివేదికను లోకల్ కంప్లైంట్స్ కమిటీకి నివేదించాలని పేర్కొన్నారు. ఈ కమిటీ మూడేళ్ల కాలపరిమితితో పని చేస్తుందన్నారు. చిన్న పిల్లల రక్షణ కోసం 1098, మహిళల సమస్యల కోసం 181, 112 టోల్ ఫ్రీ నంబర్లకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. వేధింపులకు గురైన మహిళలు మున్సిపల్ స్థాయిలో మున్సిపల్ కమిషనర్‌కు, మండల స్థాయిలో తహశీల్దార్లకు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచాలని, ఒకవేళ నేరుగా అధికారులకు ఫిర్యాదు చేయలేని పరిస్థితులలో బాధిత మహిళాలు ఫిర్యాదు ఇవ్వడానికి ప్రతి కార్యాల యంలో ఒక కంప్లయింట్ బాక్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. రెవెన్యూ డివిజనల్ అధికారి ఏ. శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ చట్టాన్ని ప్రతి ప్రభుత్వ, ప్రయివేట్ కార్యాలయాల్లో నిష్పక్ష పాతంగా అమలు పరచాలని సూచించారు. గ్రామ స్థాయిలో కూడా కమిటీలు ఏర్పాటు చేయడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. కార్యక్ర మంలో డిఎల్‌డిఒ సుబ్ర హ్మణ్యం, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, సిడిపిఒలు, తహ శీల్దార్లు, ఎంపిడిఒలు, ఎంఇఒలు, వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా మహిళా, శిశుసంక్షేమ, సాధికారత అధికారి శ్రీలక్ష్మి

మండల కేంద్రాల్లోనూ అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయాలి

- పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

గ్రామీణ పేదల కోసం అన్న క్యాంటీన్‌లను మండల కేంద్రాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలని పిసిసి మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆగష్టు 15న రాష్ట్రంలో 203 అన్నా క్యాంటీన్లు పట్టణాల్లో, నగరాల్లో ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయని చెప్పారు. పేదలు గ్రామీణ ప్రాంతాలలో ఎక్కువగా ఉంటారని చెప్పారు. అన్నా క్యాంటీన్లు గ్రామాలలో ఏర్పాటు చేయకపోవడం దురదృష్టకరం అన్నారు. గ్రామీణ పేదల పట్ల వివక్ష చూపడం ధర్మం కాదని చెప్పారు. మధ్యాహ్న భోజన పథకాన్ని గ్రామీణ, పట్టణ విద్యార్థులకు అమలు చేస్తున్నట్లే అన్నా క్యాంటీన్లు కూడా పట్టణ, గ్రామీణ పేదలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. బ్యాంకుల జాతీయీకరణ అనేది ఇందిరమ్మ తీసుకున్న నిర్ణయం సాహసోపేతం అన్నారు. 1969 జులై 19న ఆనాటి ప్రధాని ఇందిరమ్మ 14 ప్రయివేట్ బ్యాంకులను జాతీయం చేశారని తెలిపారు. అప్పటివరకు బ్యాంకులు కేవలం కొద్దిమంది పట్టణవాసులకు, పారిశ్రామిక, వ్యాపారవేత్తలకు మాత్రమే అందుబాటులో ఉండేవని చెప్పారు, గ్రామీణులకు, రైతులకు, సామాన్యులకు కూడా బ్యాంకు సేవలు అందుబాటులో ఉండాలన్న లక్ష్యంతో ఇందిరమ్మ బ్యాంకులను జాతీయం చేసినట్లు తెలిపారు. దీంతో గ్రామీణ ఆర్థిక పరిస్థితి మెరుగుపడిందని చెప్పారు. బిజెపి ప్రభుత్వం మళ్ళీ బ్యాంకుల ప్రవేటీకరణ వైపు మొగ్గు చూపడం శోచనీయం అన్నారు. ఇదే జరిగితే గ్రామీణ ఆర్థిక పరిస్థితి చిన్నాభిన్నం అవుతుందని తెలిపారు. ఆ ఆలోచనను విరమించుకోవాలని బిజెపి ప్రభుత్వానికి కాంగ్రెస్ పార్టీ సూచిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి రోజురోజుకూ క్షీణిస్తున్నట్లు తులసిరెడ్డి అన్నారు. జగన్ పాలనలో రాష్ట్రం అరాచక ఆంధ్రప్రదేశ్ అయిందని, ప్రజల ధన, ప్రాణ, మానాలకు రక్షణ లేదని ప్రజలు ఆ పార్టీని ఓడించి టిడిపి కూటమికి అధికారం అప్పజెప్పినట్లు తెలిపారు. టిడిపి కూటమి పాలనలో శాంతిభద్రతలు మరింత క్షీణించాయని అన్నారు. పెనం మీద నుండి పొయ్యిలో పడ్డట్లు అయిందని చెప్పారు. మహిళలపై అఘాయిత్యాలు, మానభంగాలు, హత్యలు నిత్యం జరుగుతున్నట్లు చెప్పారు. చంద్రబాబు ప్రభుత్వం వెంటనే శాంతి భద్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. లేకుంటే జగన్ ప్రభుత్వానికి పట్టిన గతే టిడిపి కూటమి ప్రభుత్వానికి పడుతుంది. తులసిరెడ్డి హెచ్చరించారు.

సమావేశాలు సజావుగా నడపాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల : సంఘ సభ్యులతో సమావేశాలు సజావుగా నడపాలని, అర్హత కల్గిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, కమిషనర్ రామకృష్ణ, పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో పట్టణంలోని డ్వాక్రా ఆర్‌పిలు, సిఇఒలతో సమావేశం నిర్వహించారు. డ్వాక్రా సంఘాలకు ఇచ్చే రుణ పద్ధతి గురించి తెలుసుకున్నారు. ముందుగా ఆర్‌పిలు మాట్లాడుతూ సంఘాలకు రుణ నగదు మొత్తం సభ్యుల వ్యక్తిగత ఖాతాలలో బ్యాంకు అధికారులు జమ చేస్తున్నారని తెలిపారు. డాక్యుమెంట్ చేయు సమయంలో సంఘం సభ్యురాలు ఎవరు కూడా మెప్మా సిబ్బందికి ఎటువంటి అదనపు పైకం చెల్లించలేదని పేర్కొన్నారు. 2024 2-5 ఆర్థిక సంవత్సరానికి గాను ఏప్రిల్ ఒకటి నుండి జూలై 19 వరకు కేవలం 20 సంఘాలకు మాత్రమే రుణాలు మంజూరయ్యాయని చెప్పారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ సంఘ సభ్యులతో సమావేశాలను సజావుగా నడపాలని పేర్కొన్నారు. ఏదైనా క్షేత్రస్థాయిలో అవకతవకలు చోటు చేసుకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దోమ కాటుకు దూరంగా ఉండండి

ప్రజాశక్తి -పులివెందుల టౌన్: దోమ కాటు వల్ల వచ్చే వ్యాధులపై అవగాహన అవరమని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని విద్యార్థులకు ప్రజలకు సూచించారు. శుక్రవారం లయోలా డిగ్రీ కళాశాల విద్యార్థులు పట్టణంలోని విద్యా మందిరం పరిసర ప్రాంతాలలో ప్రిన్సిపల్ అమల్ రాజ్ ఆదేశాల మేరకు మున్సిపాలిటీలో పని చేస్తున్న డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల సహకారంతో వ్యాధుల నివారణపై కార్యక్రమాన్ని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు పరిసర ప్రాంతాలలో ఉన్న మురుగు కాల్వల లోని చెత్తను తొలగించి మురుగు నీటిని శుభ్రపరిచారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూంచారు.

హెల్మెట్ ధరించండి

ప్రజాశక్తి - కడప

రాయల్ రషీద్ అసోసియేషన్ అధ్యక్షులు రాయల్ కరీముల్లా రూపొందించిన 'హెల్మెట్ ధరించండి' అనే ప్రచారం పోస్టర్లను శుక్రవారం కడప నగరం శంకరాపురంలో ఉన్న ప్రముఖ సీనియర్ వైద్యులు డాక్టర్ కె. గోపీనాథ్ క్లినిక్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపీనాథ్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రతి ఒక్కరికి ద్విచక్ర వాహనాలు ఎంత అవసరం అని, వాటిని నడిపేటప్పుడు మనం తలపాక హెల్మెట్‌ను ధరిస్తే మన శరీరంలోని ముఖ్యమైనవి కాపాడుకోవచ్చని ఆయన అన్నారు. మైనర్లు కూడా మోటార్ బైకులు నడుపుతున్నారని వారిని తమ తల్లిదం డ్రులు క్రమశిక్షణలో పెట్టాలని కోరారు. కార్యక్రమంలో రాయల్ కరిముల్లా, రాజేష్. కుమార్ స్వామి, యోగి పాల్గొన్నారు.

అవినీతి అధికారిపై చర్యలు తీసుకోవాలి : ఎస్‌టియు

ప్రజాశక్తి- కడప అర్బన్

అన్నమయ్య, కడప జిల్లాల పూర్వపు డిఇఒగా పనిచేసిన వై.రాఘవరెడ్డి అవినీతి, అక్రమాలపై విచారించి తగు చర్యలు తీసుకోవాలని ఎస్‌టియు కడప జిల్లా శాఖ విచారణ అధికారి ప్రసన్నకుమార్‌ను కోరారు. శుక్రవారం కడప ఆర్‌జెడి కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వై.రాఘవరెడ్డి అన్నమయ్య జిల్లా డిఇఒగా ఉన్నప్పుడు అనర్హులను ఓటర్లుగా నమోదు చేశారని తెలిపారు. స్కూల్ వ్యాన్ డ్రైవర్లు, స్కూల్ అటెండర్లను నర్సరీ టీచర్లను కూడా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లుగా నమోదు చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇలియాస్ బాషా, సంగమేశ్వర రెడ్డి, బాధిత ఉపాధ్యాయులు సనావుల్లా, నాగేంద్ర పాల్గొనారు.

29, 30న ఏడీ సెట్-24 కౌన్సెలింగ్

ప్రజాశక్తి - కడప అర్బన్ డాక్టర్ వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ వర్సిటీలో ప్రవే శాలకు జూలై 29, 30వ తేదీల్లో ఏడీసెట్-24 (ఆర్ట్ అండ్ డిజైన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్) కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఏడీసెట్-24 కన్వీనర్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బిఎఫ్ఎ పెయి ంటింగ్, శిల్పం, యానిమేషన్, అప్లైడ్ ఆర్ట్స్, ఫొటోగ్రఫీ, బ్యాచ్‌లర్ ఆఫ్ డిజై న్ కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రవేశాలు కల్పి స్తున్నట్లు పేర్కొన్నారు. విద్యా దీవెన,వసతి దీవెన పథకాల కింద ఫీజు రీయి ంబర్స్‌మెంట్ కావాల్సిన వారు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఒరిజి నల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ పత్రాలు,6 పాస్ పోర్టు సైజు ఫొటోలు తీసు కురావాలని తెలిపారు. కౌన్సెలింగ్ రోజే సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న పెరుగు నారాయణ యాదవ్

డయేరియా బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని అల్లాడుపల్లెలో డయేరియాతో బాధపడుతూ ప్రొద్దుటూరు ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులకు గ్రామానికి చెందిన టిడిపి నాయకులు, ఎంఎల్ఎన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఎమ్‌డి పెరుగు నారాయణ యాదవ్ ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామానికి చెందిన పలువురు పేద ప్రజలు డయేరియాతో బాధపడుతూ ప్రొద్దుటూరులోని పలు ప్రయివేట్ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకొని శుక్రవారం ఆయన స్వయంగా వెళ్లి బాధితులను పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను కోరారు. చిన్నపిల్లల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. అవసరమైతే మెరుగైన వైద్యం అందించేందుకు తన వంతు సహకారం అందిస్తామని సూచించారు. మూడు ప్రయివేట్ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న నిహంత్ , అక్షర, యస్వంత్, విశ్వతేజ, నిఖిల్, తివిక్రమ్, నేహంత్, అన్విత, విష్ణు కాంత్,మోహిత్ తదితర 12 మంది బాధితులను పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో గ్రామ నాయకుడు వీరారెడ్డి, బాధితుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. పేద ప్రజల కష్టాలను గుర్తించి ఆర్థిక సహాయాన్ని అందజేసిన నారాయణ యాదవ్ ను పలువురు అభినందిస్తున్నారు.

త్వరలో సబ్సిడీ ధరకు కందిపప్పు, బియ్యం పంపిణీ

ప్రజాశక్తి- సింహాద్రిపురం

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సింహాద్రిపురం మండల కేంద్రంలో ప్రభుత్వం నిర్ణయించిన ధరకే కందిపప్పు, బియ్యం ప్రజలకు త్వరలో పంపిణీ చేస్తామని తహశీల్దార్ భీమేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన సింహాద్రిపురంలోని తహశీల్దార్ కార్యాలయంలో బియ్యం, కందిపప్పు వ్యాపారులు, ట్రేడర్స్ రైస్ మిల్ యాజమాన్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కందిపప్పు, బియ్యం ధరలు అమాంతంగా పెరగడంతో వినియోగదారులు కొనుగోలు చేయాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కందిపప్పు కిలో రూ.160, బియ్యం ఒక రకం రూ.49, రెండవ రకం రూ.48లకు ప్రత్యేక కౌంటర్ ద్వారా ప్రజలకు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శిరీష, ఆర్ఐ షేక్షావలి పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల : మండలంలోని చిలమకూరులో సాయి ప్రయివేట్ పాఠశాలలో కుష్ఠ వ్యాధి లక్షణాలు, చికిత్స గురించి విద్యార్థులకు పిహెచ్‌సి వైద్యులు సాయిచరిత రెడ్డి ఆధ్వర్యంలో హెల్త్ ఎడ్యుకేటర్ నాగమునిరెడ్డి సమావేశం నిర్వహించారు. చర్మం మీద స్పర్శ లేని మచ్చలు, కనుబొమ్మలు, కనురెప్పలు వెంట్రుకలు రాలిపోడం, కనురెప్పలు మూత పడక పోవడం, చేవులపై, వీపు పై, ఎద పై నొప్పిలేని బొడిపెలు ఉండటం, అరచేతులు, అరికాళ్ళు స్పర్శ లేకపోవడం కుష్ఠ వ్యాధి లక్షణాలు అని,అంగవైకల్యము రాకుండా ఉండాలంటే ముందుగా తెలపాలని, కుష్ఠ వ్యాధికి చికిత్స ఉందని,ఎవరినైనా గుర్తిస్తే ఒకటి నుండి ఐదు పొడలు ఉంటే ఆరు నెలలు చికిత్స అని, అంత కన్నా ఎక్కువ మచ్చలు ఉంటే సంవత్సరం చికిత్స ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎఎన్ఎం సరోజ, అశా వర్కర్స్ భవాని, భారతి, పాఠశాల హెడ్మాస్టర్, ఉపాధ్యా యులు పాల్గొన్నారు. **ఖాజీపేట :** కుష్ఠి వ్యాధి పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ముబీన్ ఉన్నారు. శుక్రవారం పుల్లూరు, పత్తూరు, కొత్త పేట, చెములపల్లి గ్రామాలలో జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి నాగభూషణం, పర్యవేక్షకురాలు కృష్ణ ప్రియ, శోభన్ బాబు, కరుణా కర్ లక్ష్మీకాంతమ్మ పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి - సింహాద్రిపురం : ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపిడిఒ సల్మాన్ రాజ్ సూచించారు. శుక్రవారం మండలంలోని సుంకేసుల, పైడిపాలెం, సింహాద్రిపురం గ్రామాలలో వైద్య శాఖ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతిసారా వ్యాధి ప్రబులుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ నీటి ట్యాంకులను ఎప్పటికప్పుడూ శుభ్రం చేసుకోవాలని సూచించారు. గ్రామాలలోని మురుగు కాలువలను శుభ్రపరచాలని అధికారులకు సూచించారు. వైద్య శాఖ సిబ్బంది గ్రామాలలో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి పద్మనాభ రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.